GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 207 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | సోమవారం : మార్చి 11-2024 | పేజీలు : 4

## 21 వరకు యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు




**టీ మీడియా, మార్చి 10,యాదగిరిగుట్ట :**ఈనెల 11 నుండి 21 వరకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 11న స్వస్తి వచనంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు బ్రహ్మోత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బఅందం పాల్గననున్నారు. రేపు ఉదయం యాదాద్రికి సీఎం రేవంత్ రెడ్డి పాటు ఆరుగురు మంత్రులు యాదగిరిగుట్టకు వెళ్లనున్నారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకోనున్నారు. అనంతరం అక్కడి నుంచి భద్రాచలం వెళ్లనున్నారు.యాదగిరిగుట్టలో ఈ నెల 17న శ్రీ స్వామి వారి ఎదుర్కోలు.. 18న శ్రీ స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం.. 19న శ్రీ స్వామి వారి దివ్య విమాన రథోత్సవాలను నిర్వహించనున్నారు. రూ. కోటి 60 లక్షల బడ్జెట్‌తో శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనుబంధ పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19న ప్రారంభమై 25 వరకు కొనసాగనున్నాయి.

# షెడ్యూల్ ఏరియా గుర్తింపునకు మీనమేషాలు



**- గిరిజనులను మోసగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**

**- అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు కరువు**

**టీ మీడియా, మార్చి 10, విజయనగరంబ్యూరో :** రాష్ట్రంలో షెడ్యూల్ ఏరియా పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. రీసర్వే పేరుతో సాగదీత ధోరణి అవలంభిస్తున్నాయి. గిరిజన ప్రాంతంలో పుట్టి, పెరిగినప్పటికీ ఆయా గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చకపోవడంతో రాజ్యాంగం కల్పించిన హక్కులు, సంక్షేమ పథకాలను గిరిజనులు పొందలేకపోతున్నారు. 1/70 చట్టం వర్తించకపోవడంతో స్థానికేతర పెత్తందారులు గిరిజన భూములను కారుచౌకగా కొనేసుకోవడం, దానికి ఆనుకొని ఉన్న కొండలు, డి-పట్టా భూములు ఆక్రమించుకోవడం వంటివి యథేచ్ఛగా సాగుతున్నాయి. అటవీ ప్రాంత గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్పించాలని, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజన సంఘం, సిపిఎం దశాబ్దాలుగా పోరాడుతున్నాయి. గిరిజన స్పెషల్ డిఎస్‌సి విడుదల చేయాలని, జిఒ నెంబర్ 3పై ఆర్డినెన్స్ ఇవ్వాలని, అటవీ భూముల చట్ట సవరణ రద్దు చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని, ఆదివాసీ మాతృభాషా వలంటీర్లను రెగ్యులరైజ్ చేయాలని తదితర డిమాండ్లతో ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంత బంద్ జరగనుంది. బంద్ విజయవంతానికి, ర్యాలీలు, మానవహారాలు తదితర రూపాల్లో నిరసన వ్యక్తం తెలిపేందుకు గిరిజనులు సమాయత్తమయ్యారు.ఉమ్మడి రాష్ట్రంలో అనేక సర్వేలు చేపట్టిన గిరిజన సంఘం సుమారు 1,200 గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్పించాలని డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర విభజన తరువాత విస్తీర్ణం, జనాభా రీత్యా గిరిజన ప్రాంతం మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో కనీసం 700 గ్రామాలను ప్రతిపాదించాల్సి ఉందని గిరిజన సంఘాలు చెబుతున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి అధ్యక్షతన 2019 నవంబర్ 12న జరిగిన గిరిజన సలహా మండలి సమావేశం 554 గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్పించేందుకు తీర్మానించింది. ఇందులో విజయనగరం జిల్లాలో 182, శ్రీకాకుళంలో 240, విశాఖలో 91, తూర్పుగోదావరి జిల్లాలో 40 గ్రామాలు, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక గ్రామం ఉన్నాయి. అయితే, ఆ తర్వాత మంత్రి పుష్పశ్రీవాణి యూటర్న్ తీసుకున్నారు. ప్రతిపాదిత షెడ్యూల్ గ్రామాల్లో కొన్నిచోట్ల అభ్యంతరాలు, మరికొన్ని గుర్తించాల్సిన గ్రామాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో రీసర్వే చేస్తామని 2019 డిసెంబర్ రెండున ఆమె ప్రకటించారు. ఇందులో వాస్తవం ఉన్నప్పటికీ, సర్వే నివేదిక 35 ఏళ్ల క్రితం నాటిదని కొత్తగా చెప్పడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలో 90 రెవెన్యూ గ్రామాలు ఉండగా, షెడ్యూల్ ఏరియాలో ఉన్నవి 24 మాత్రమే. ప్రతిపాదిత గ్రామాలు 44 ఉన్నప్పటికీ మరో పది గ్రామాల వారు షెడ్యూల్ ఏరియాలో చేర్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మక్కువ మండలంలో 21 పంచాయతీల పరిధిలో సుమారు 54 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇందులో కేవలం శంబర గ్రామానికి చెందిన బీరమాసి ఒక్కటే షెడ్యూల్ ఏరియా పరిధిలో ఉంది. మండలం మొత్తం అటవీ ప్రాంతంలో ఉండడం, మెజార్టీ గ్రామాల్లో ఎక్కువమంది గిరిజనులు ఉండడం వల్ల 52 గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలనేది గిరిజన సంఘాల డిమాండ్. గిరిజన సలహా మండలి ప్రతిపాదనలో కేవలం 26 గ్రామాలు మాత్రమే ఉన్నాయి. పాచిపెంట మండలంలో 54 రెవెన్యూ గ్రామాలకుగాను ప్రస్తుతం 21 గ్రామాలు మాత్రమే షెడ్యూల్ ఏరియాలో ఉన్నాయి. మిగిలిన అత్యధిక గ్రామాల్లో గిరిజన జనాభాయే ఎక్కువగా ఉన్నప్పటికీ ఇటీవల కేవలం 17 గ్రామాలను మాత్రమే షెడ్యూల్ ప్రాంతంలో చేర్పించేందుకు ప్రతిపాదించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గిరిజన మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో 35 ఏళ్ల క్రితం నాటి ప్రతిపాది జాబితాను అమలు చేసే బదులు, రీసర్వే చేపట్టడం మంచిదే. కానీ, ఆ పేరుతో కాలక్షేపం చేస్తుండడంతో గిరిజనుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే షెడ్యూల్ ఏరియాలోలేని గిరిజన గ్రామాల్లో స్థానికేతర పెత్తందారులు వందల ఎకరాలు ఆక్రమించుకుని రూ.కోట్లకు పడగలెత్తారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు ఏళ్ల తరబడి సాగు హక్కు కల్పించకపోగా, పట్టాలు ఇవ్వడం లేదు. గిరిజనులు అటవీ ఉత్పత్తులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నా వాటికి గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి.

చాలా గ్రామాలకు నేటికీ రహదారి సౌకర్యం లేకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నప్పుడు గిరిజనులకు డోలీ మోతలే దిక్కవుతున్నాయి.

## యాదాద్రికి సీఎం రేవంత్ రెడ్డి



టీ మీడియా, మార్చి 10, హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రేపు (మార్చి 11) యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని సందర్శించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి యాదాద్రిలో పర్యటిస్తుండడం ఇదే తొలిసారి. సోమవారం నుంచి యాదాద్రి గుట్టపై లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 21 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. రేపు బ్రహ్మోత్సవాల తొలి రోజున జరిగే స్వస్తి పూజలలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఆరుగురు మంత్రులు కూడా ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. లక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి నుంచి భద్రాచలం పయనమవుతారు.

## కాంగ్రెస్ గెలిస్తే.. బీజేపీతో జతకట్టవచ్చు - కేరళ సీఎం



**టీ మీడియా, మార్చి 10, తిరువనంతపురం:** కేరళ సీఎం పినరయి విజయన్ కాంగ్రెస్ పార్టీని ఘాటుగా విమర్శించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే, ఆ తర్వాత బీజేపీతో జతకట్టవచ్చని అన్నారు. శనివారం తిరువనంతపురంలో ఎల్డీఎఫ్ ఎన్నికల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేరళ మాజీ సీఎం కే కరుణాకరన్ కుమార్తె, కాంగ్రెస్ నాయకురాలు పద్మజా వేణుగోపాల్ బీజేపీలో చేరడాన్ని ఆయన ప్రస్తావించారు. 'బీజేపీ గెలిస్తే ఆ పార్టీ అలాగే ఉంటుంది. అయితే కాంగ్రెస్ గెలిస్తే రేపు బీజేపీతో పొత్తు పెట్టుకోవచ్చు' అని అన్నారు. కాగా, కాంగ్రెస్‌కు ఇతర వర్గానికి తేడా ఏముందని సీఎం విజయన్ ప్రశ్నించారు. 'కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? 11 మంది మాజీ కాంగ్రెస్ సీఎంలు ఇప్పుడు ఎటువైపు ఉన్నారు? వారు బీజేపీ నాయకత్వంతో ఉన్నారు. అశోక్ చవాన్, అమరీందర్ సింగ్, దిగంబర్ కామత్, ఎస్ఎం కృష్ణ, విజయ్ బహుగుణ, కిరణ్ కుమార్ రెడ్డి, ఎన్డీ తివారీ, జగదాంబిక పాల్, పెమా ఖండూ, నారాయణ్ రాణే, గిర్ధర్ గామాంగ్ బీజేపీలో చేరారు. ఇంకా ఎంతమంది చేరుతారో ఎవరూ ఊహించలేరు. ఇదీ కాంగ్రెస్ పరిస్థితి' అని వ్యాఖ్యానించారు. మరోవైపు, కేరళలో వన్యప్రాణుల దాడులకు సంబంధించి సమగ్ర పరిష్కారం కోసం వన్యప్రాణుల చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉందని సీఎం విజయన్ తెలిపారు. వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ తన పార్లమెంట్ ప్రసంగంలో వన్యప్రాణుల దాడుల అంశాన్ని ఎప్పుడూ ప్రస్తావించలేదని విమర్శించారు.

## మహిళలకు రూ.2,500 అమలు ముహూర్తం ఖరారు

**12 న జరిగే క్యాబినెట్ లో ఆమోదం**



**టీ మీడియా, మార్చి 10, హైద్రాబాద్ :**

మహిళలకు సీఎం రేవంత్ గుడ్ న్యూస్ చెప్పారు. మరో రెండు గ్యారంటీల అమలుకు నిర్ణయించారు. ఈ నెల 12న జరిగే కేబినెట్ సమావేశంలో అధికారికంగా ఆమోద ముద్ర వేయనున్నారు. మరో నాలుగు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండటంతో..ఈ లోగానే పథకాలను ప్రారంభించాలని నిర్ణయించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థికసాయం పథకం అమలుకు రేవంత్ డిసైడ్ అయ్యారు. సోమవారం ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని ప్రారంభించనున్నారు.

**మరో రెండు గ్యారంటీల అమలు**


తెలంగాణలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను హామీగా ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగింటిని ప్రారంభించింది. మిగిలిన రెండు గ్యారెంటీలను అమలు చేయటానికి రంగం సిద్ధం చేసింది. రేపు (సోమవారం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రారంభించనున్నారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో దాదాపు లక్ష మంది స్వయం సహాయక బృందాల మహిళలతో నిర్వహించనున్న భారీ సదస్సులో.. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థికసాయం పథకంపై సీఎం కీలక ప్రకటన చేయనున్నారు. ఇప్పటికే ప్రజాపాలన ద్వారా వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఎంత మంది లబ్దిదారులు ఉన్నారు..ఎంత మేర ఆర్థిక భారం పడుతుందనే అంశం పైన అంచనాకు వచ్చారు.

**మంత్రివర్గ భేటీలో నిర్ణయం**

ఈ నెల 14 లేదా 15వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. దీంతో, ఈ నెల 12న తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో మహాలక్ష్మి పథకం కింద రూ 2500 చొప్పున అందించే భృతి అమలు పై నిర్ణయం ప్రకటించనున్నారు. అదే రోజు పరేడ్ గ్రౌండ్స్ సభలో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించనున్నారు. లక్ష మంది స్వయం సహాయక బృందాల మహిళలతో ప్రభుత్వం నిర్వహించనున్న ఈ సదస్సులోనే.. మహిళలకు వడ్డీ లేని రుణాలిచ్చే అంశంపైనా సీఎం ప్రకటన చేయవచ్చని తెలుస్తోంది. దీనిపైనా క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు చికిత్స, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించింది.

**కీలక నిర్ణయాల దిశగా**

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున అందించే పథకం అమలుపై సంబంధిత అధికారులు కసరత్తు వేగవంతం చేసారు. ఈ సారి మంత్రివర్గ సమావేశంలో ఎమ్మెల్సీల నియామకం పైన నిర్ణయం తీసుకోనున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను తీసుకురానుంది. ఈ మేరకు పథకం అమలులో కొన్ని మార్పులు చేయాలని భావిస్తోంది. ధరణి పోర్టల్‌లో సమస్యలు, లే-అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) తదితర అంశాలూ క్యాబినెట్ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. అయితే, లోక్ సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు దక్కించుకోవటం పైనే రేవంత్ గురి పెట్టారు. దీంతో, ఎన్నికల ముందు జరిగే ఈ మంత్రివర్గ సమావేశంలో తీసుకొనే నిర్ణయాల పైన ఉత్కంఠ నెలకొంది.



# బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తు ఖరారు

## సీట్ల పంపిణీపై క్లారిటీ, త్వరలోనే ప్రకటన!



**టీ మీడియా, మార్చి 10, హైదరాబాద్:**
పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తిని రేపుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు మొదటి జాబితాలో భాగంగా అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సారి ఎన్నికల్లో పొత్తులు కీలక కానుండటంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. కాంగ్రెస్ పార్టీ సీపీఐతో గత ఎన్నికల మాదిరిగానే పొత్తు పెట్టుకుంటుండగా, బీఆర్ఎస్ బీఎస్పీతో జతకడుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఇరు పార్టీల కలయిక హాట్ టాపిక్ గా మారింది. పొత్తు ఉంటుందా? లేదా అనే విషయమై బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మరోసారి క్లారిటీ ఇచ్చేశారు.తెలంగాణలో బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తుకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి అనుమతి లభించిందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఇరు పార్టీలు కలిసి పోటీచేస్తాయని ప్రకటించారు. బీఎస్పీ-బీఆర్ఎస్ పార్టీల కూటమి చర్చలపై రాష్ట్రంలో ఏర్పడిన సందిగ్ధానికి బెహన్జీ మాయావతి కొద్ది సేపటి క్రితమే తెరదించారని ఆయన వివరించారు.రాష్ట్రంలోని బీఆర్ఎస్ ఎన్డీయే, ఇండియా కూటములతో లేనందున ఆ పార్టీతో కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేయడానికి పార్టీ హై కమాండ్ అనుమతించిందని తెలిపారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీలు ఉమ్మడిగా పోటీ చేసే స్థానాలపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు వివరించారు. బీఎస్పీ, బీఆర్ఎస్ కూటమి కలిసి పోటీ చేసే స్థానాలపై త్వరలోనే సంయుక్త ప్రకటన ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో జరిగే తదుపరి చర్చలకు పార్టీ రాజ్యసభ ఎంపీ, కేంద్ర సమన్వయకర్త రాంజీ గౌతమ్ బెహన్జీ దూతగా హాజరుకానున్నారని తెలిపారు. ఇరు పార్టీల మధ్య సీట్ల పంపకాలు, ఉమ్మడి భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే సంయుక్తంగా మీడియాకు వెల్లడిస్తామన్నారు.బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తులపై మీడియాలో వస్తున్న నిరాధారమైన వార్తలు, వదంతులు ,దుష్ప్రచారాలను పార్టీ శ్రేణులు నమ్మవద్దని ఆర్ఎస్ ప్రవీణ్ రిక్వెస్ట్ చేశారు.

# రాముడిని కూడా ఈడీతో వెంటాడి బీజేపీలో చేరాలని ఒత్తిడి చేసేవారు : ఢిల్లీ సీఎం కేజ్రీవాల్



**టీ మీడియా, మార్చి 10, న్యూఢిల్లీ :**
ఈ కాలంలో రాముడు ఉండి ఉంటే ఈడీ వంటి దర్యాప్తు సంస్థలతో వేధించి ఆయనను కూడా బీజేపీలో చేరాలని ఒత్తిడి చేసేవారని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కాషాయ పార్టీపై విరుచుకుపడ్డారు. కాషాయ పార్టీలో చేరాలని లేకుంటే జైలులో ఉంటారని రాముడినీ ఒత్తిడి చేసేవారని బీజేపీని దుయ్యబట్టారు. కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈడీ సమన్లను కేజ్రీవాల్ పట్టించుకోని విషయం తెలిసిందే. ఆప్ సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తే బీజేపీ ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విపక్ష ప్రభుత్వాలను వేధించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. మరోవైపు కేజ్రీవాల్ విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. రాజకీయ అంశాల్లో రాముడి పేరు లాగడం తగదని, ఇది కోట్లాది భకత్‌ల మనోభావాలను దెబ్బతీస్తుందని కేజ్రీవాల్‌పై కాషాయ పార్టీ మండిపడింది. సానుభూతి పొందేందుకు ఆప్ నేతలు తరచూ రాముడి పేరును ప్రస్తావించడం విచారకరమని ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ అన్నారు.

# షెడ్యూల్డ్ ఏరియా లో గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తే అడ్డుకొని తీరుతాం

- ప్రత్యేక ఆర్డినెన్సు తెచ్చి 29 ప్రభుత్వ శాఖల్లో ఆదివాసీలను నియమించాలి
- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు డిమాండ్



**టీ మీడియా, మార్చి 10, ములుగు బ్యూరో :** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో రాష్ట్రంలో అభివృద్ధి గిరిజనుల సమాధుల పైన జరుగుతోంది అని ఆదివాసీ నవనిర్మాణ సేన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు ఆరోపించారు. ఆదివారం ఒంటిమామిడి గ్రామం లో మండల ప్రధాన కార్యదర్శి కుంజ మహేష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిదులు గా, ఏ ఎన్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు పాల్గొన్నారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాల వల్ల దేశంలోనీ ఆదివాసీల జీవన విధానం అధమ స్థానానికి చేరుకుందనీ మండిపడ్డారు. పదకొండో తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి గృహలక్ష్మి పథకం ను ప్రారంభించడానికి వస్తున్న నేపథ్యంలో ఆదివాసీ నవనిర్మాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు ఈ విధంగా స్పందించారు. షెడ్యూల్డ్ చట్టాలను సమాధి చేయడానికి భద్రాచలం వస్తున్నావా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నిలదీశారు. షెడ్యూల్డ్ ప్రాంతమైన భద్రాచలం నియోజక వర్గంలో వలస గిరిజనేతరులకు 1/70 చట్ట విరుద్ధంగా గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు ఎలా కేటాయిస్తారని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉంటూ, రాజ్యాంగ బద్దంగా ఏర్పడిన ఐదవ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన చట్టాలను ఉల్లంఘించడం పైన నాగరాజు తీవ్ర అభ్యంతరం వ్యక్తచేశారు. ప్రభుత్వాలు, పాలకులు మారిన గిరిజన చట్టాల పైన వారి వైఖరి మారడం లేదన్నారు. నీళ్ళు,నిధులు, నియామకాలు ఆంధ్రోళ్లు దోచుకుంటున్నారని పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిజానికి దోపిడీకి గురయ్యేది ఆదివాసీలే అని అన్నారు. ఏజెన్సీ ప్రాంతం లోని గోదావరి జలాలు, ఖనిజ సంపద, ఉద్యోగాలు అన్ని అన్యాక్రాంతం అవుతున్నటున్నట్లు ఆయన తెలియజేశారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో తిష్ట వేసిన దోపిడీ దారులు అయిన వలస గిరిజనేతరులను మైదాన ప్రాంతానికి రలించి, వారి అక్రమ ఆస్తులను ఆదివాసీలకు పంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ డిమాండ్ చేశారు. గడిసిన ఎన్నికల్లో ఆదివాసీ లు మొత్తం కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన్నప్పటికి ప్రభుత్వం మాత్రం బంజారాలు, గిరిజనేతరుల పక్షాన నిలబడటం దుర్మార్గపు చర్య అన్నారు. ఉమ్మడి షెడ్యూల్డ్ మండలాలను గత ప్రభుత్వం విచ్చిన్నం చేసి గిరిజన ఉప ప్రణాళిక గ్రామాలను సైతం మైదాన ప్రాంతాల్లో కలిపి గిరిజనుల జీవన విధ్వంసానికి కారణం అయిందని పేర్కొన్నారు. ఉమ్మడి షెడ్యూల్డ్ మండలాలను ఆ నియోజకవర్గ, జిల్లాల పరిధిలోనే మరలా యదా తదంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతం లోని ఆదివాసీ నిరుద్యోగుల కోసం ప్రత్యేకమైన ఆర్డినెన్సు సత్వరమే తీసుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు.అధికరణ 244 ప్రకారం ఐదో షెడ్యూల్డ్ ప్రాంతం స్వయం ప్రతిపత్తి కలిగినది కాబట్టి 29 ప్రభుత్వ శాఖల్లో ఆదివాసీల చేతనే నియమించాలని అన్నారు.ఈ కార్యక్రమం పోతురాజు, గోపి, గణేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు వైద్యం చేరువ కావాలి

**- పలుస శంకర్ గౌడ్**



**టీ మీడియా, మార్చి 10, వనపర్తి బ్యూరో :** వైద్యం పేద ప్రజలకు చేరువ కావాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. గత మూడు ఆదివారాలుగా కొత్తకోట మండల కేంద్రం సరస్వతీ శిశు మందిర్ లో మహబూబ్ నగర్ సత్యసాయి హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో డా.సాయి కృష్ణగౌడ్ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన కళావేదిక సభ్యులు వైద్యులను ఘనంగా సన్మానించారు.శంకర్ గౌడ్ మాట్లాడుతూ సరైన వైద్యం అందక ఎంతో మంది పేద ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని వారికి స్వచ్ఛందంగా డా.సాయికృష్ణ, సేవలు అందించడమే గాక ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు.ఇప్పటికే కొత్తకోట చుట్టు ప్రక్కల గ్రామాల వారు వైద్య సేవలు అందుకుంటున్నారని మరో మూడు ఆదివారాలు ఈ శిబిరాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో సాహితీ కళా వేదిక ప్రతినిధులు సూర చంద్ర శేఖర్,రాములు యాదవ్,దేవన్న, వెంకట్రాములు, బైరోజు చంద్ర శేఖర్,నిర్వాహకులు శ్రీనివాసులు,శేఖర్ గౌడ్, శ్యాం సుందర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## నయనానందకరం మహానందీశ్వరుని రథోత్సవం..

**- శివనామస్మరణలతో మారుమ్రోగిన మహానంది పుణ్యక్షేత్రం**



**టీ మీడియా, మార్చి 10, మహానంది:** ప్రముఖ శైవ క్షేత్రం మహానంది పుణ్య క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శ్రీ కామేశ్వరీ దేవి సమేత మహానందీశ్వర స్వామి రథోత్సవం కన్నుల పండుగగా సాగింది.ఆదివారం ఉదయం క్షేత్రంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.శాస్త్ర యుక్తంగా,వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలను వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. రథశాల వద్ద వేదపండితులు, రుత్వికులు,అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.రథాంగబలి, బలిహరణహ, కొబ్బరికాయ, గుమ్మడికాయలు రథం వద్ద కొట్టి వేద మంత్రోచ్చారణలు మంగళ వాయిద్యాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహానంది క్షేత్రంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాల అనంతరం ఆలయంలోని ప్రధాన రాజగోపురం గుండా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో తీసుకొని వచ్చి రథంపై ఆశీనులు గావించారు. అనంతరం రథశాల వద్ద ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి,వేద పండితులు కొబ్బరికాయలు కొట్టి అశేష జనవాహిని మధ్య రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవంలో భాగంగా భక్తుల కోలాహలంతో మహానంది పుణ్యక్షేత్రంలో ఒక పండుగ వాతావరణం నెలకొంది.అశేష జనవాహిని మధ్య హర హర మహాదేవ శంభో శంకర అనే పంచాక్షరి మంత్రం పఠిస్తూ భక్తులు రథాన్ని ఆలయ మాడ వీధుల గుండా లాగుతూ తమ భక్తిని చాటుకున్నారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజన, మంగళ వాయిద్యాల నడుమ అశేష జన వాహిని మధ్య క్షేత్ర మాడవీధుల్లో రథోత్సవం నయనానందకరంగా సాగింది. రథోత్సవంలో భాగంగా భక్తుల కోలాహలంతో మహానంది పుణ్యక్షేత్రంలో ఒక పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, తహసిల్దార్ రామచంద్రుడు, సీఐ శివకుమార్ రెడ్డి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఆలయ ఏఈఓలు మధు, వెంకటేశ్వర్లు, మార్కెట్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎండిపోయిన పొలాలను సందర్శించిన మాజీ మంత్రి

**- కొప్పుల ఈశ్వర్**



**టీ మీడియా మార్చి 10, ఎండపల్లి :** ఎండపల్లి మండలం మారేడుపల్లి-ముంజంపల్లి గ్రామాలలో నీరు లేక ఎండిపోయిన వరిపంట, పొలాలను సందర్శించి రైతుల తో కలిసి నిరసన తెలిపిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ పంప్ హౌస్ ద్వారా నీళ్ళు వస్తాయని గంపెడు ఆశలతో దాదాపు 820 మంది రైతులు ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామలలో 1800 ఎకరాల్లో వరి సాగు చేసారు అని రైతులు వేసిన వరిపంట పొలాలు పొట్ట దశలో చేరుకునే సమయానికి సాగు నీరు అందక ఎండిపోతున్న పొలాలకు తక్షణమే సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చెసారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింహచలం జగన్, రియాజ్,మాజీ సర్పంచ్ లు నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## అదృశ్యమైన వ్యక్తి - రిజర్వాయర్ డ్యాంలో మృతి



**టీ మీడియా, మార్చి 10, రేవల్లి :** రేవల్లి మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని శానాయి పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి, గుడిపల్లి రిజర్వాయర్ డ్యామ్ లో పడి మృతి చెందాడు. ఎస్ఐ తిరుపతి రెడ్డి సమాచారం మేరకు, కందే బాల్ చంద్రయ్య (70) వ్యవసాయం. మృతుడికి ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. శు క్రవారం మహాశివ రాత్రి పండుగ సందర్భంగా, శానాయిపల్లి గ్రామంలోని మల్లయ్య గట్టు జాతర ఉత్సవాల కోసం, గురువారం బాల నాగయ్యతో పాటు ఇద్దరు వ్యక్తులు అలంకారాలు చేసి ముగించుకొని, సాయంత్రం తమ గ్రామానికి వెళ్లే క్రమంలో, ముగ్గురు ఉదయం నుంచి బాగా అలసి పోయి ఉన్నామని అక్కడే కాస్త మద్యం సేవించారు. కానీ బాల నాగయ్య కు కాస్త మందు ఎక్కువ కావడంతో జాతరలోనే నిద్రించాడు. మిగతా ఇద్దరూ తమ గ్రామానికి వెళ్లిపోవడం జరిగింది. బాల్ చంద్రయ్య మాత్రం తిరిగి మూడు రోజులు నుండి ఇంటికి రాక పోయేసరికి కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం పరిసర గ్రామాలు, బంధువులు ఇళ్లలో వెతికారు. చివరికి గుడిపల్లి రిజర్వాయర్ డ్యామ్ లో పడి మృత దేహం తేలుతూ అక్కడ ఉన్న స్థానిక రైతులకు కనిపించడంతో, వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి పెద్ద కుమారుడు ఫిర్యాదు మేరకు మృత దేహాన్ని ఆదివారం రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మరోసారి ఏపీ ప్రజల మోసానికి చంద్రబాబు పొత్తులు

- ఏపీ సీఎం వైఎస్ జగన్




**టీ మీడియా, మార్చి 10, అమరావతి :**
ఏపీలో వైసీపీ పాలనలో ఇంటింటికి అందుతున్న పథకాలను చూసి ఎన్నికల్లో గెలుపొందలేమన్న ఓటమి భయంతో చంద్రబాబు బీజేపీ, జనసేనతో పొత్తులు పెట్టుకున్నారని ఏపీ సీఎం వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ఆదివారం బాపట్ల జిల్లా మేదరమెట్లలో నిర్వహించిన వైసీపీ సిద్ధం బహిరంగ సభలో మాట్లాడారు. చంద్రబాబు నేరుగా వైసీపీతో తలబడ లేక ఢిల్లీకి వెళ్లి దత్తపుత్రుడితో కలిసి పడిగాపులు కలిసి ఢిల్లీ పెద్దలను కలిశారని దుయ్యబట్టారు.రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకే పొత్తులు కుదుర్చుకున్నారని విమర్శించారు. పొత్తులో సైన్యాధిపతులే తప్ప వారికి సైన్యం లేదని దుయ్యబట్టారు. కొన్ని పార్టీలకు నోటాకు వచ్చిన ఓట్లు కూడా రాని పార్టీలు, రాష్ట్రాన్ని విడదీసిన పార్టీలు, ఓడిపోయిన పార్టీలతో పొత్తులు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు మాదిరిగా నాకు స్టార్‌క్యాంపెయినర్లు లేరు. నాకు ప్రజలే క్యాంపెయినర్లని, వైసీపీకి 5 కోట్ల మంది ప్రజలు అండగా ఉన్నారని తెలిపారు. తమకు విలువలు, విశ్వసనీయత, సిద్ధాంత బలం, ఇంటింటికి మంచిచేశామన్న నమ్మకం ఉందని అన్నారు. ప్రజలది కృష్ణుడి పాత్రయితే, తనది అర్జునుడి పాత్ర అని అన్నారు. ప్రజలకిచ్చిన హామీలను99 శాతం అమలు చేశామని పేర్కొన్నారు.

**తుప్పుపట్టిన సైకిల్‌ను తోలేందుకు ఇతర పార్టీల మద్దతు...**

టీడీపీ గుర్తయిన సైకిల్‌కు నేడు ట్యూబులు లేవు. టైర్లు లేవు.చక్రాలు లేవు. తుప్పు పట్టిన సైకిల్‌ను తోలటానికి ఇతర పార్టీల మద్దతు తీసుకుంటున్నారని జగన్ విమర్శించారు. ఎంత మందితో పొత్తుపెట్టుకున్న వారి విలువ సున్ననేనని వెల్లడించారు. 2014లో అదే మూడుపార్టీలతో పొత్తులు ఏర్పడి ప్రత్యేక హోదా,రుణ మాఫీ , డ్వాక్రా మహిళలకు రుణాలు, ఇంటింటికీ ఉద్యోగం, ఉపాధి, నిరుద్యోగ భృతి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, తిరిగా అదే కూటమి నేడు పొత్తులతో వస్తున్నాయని దుయ్యబట్టారు.

# కాషాయ పార్టీని మట్టికరిపించడమే విపక్ష కూటమి లక్ష్యం

- తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్



**టీ మీడియా, మార్చి 10, చెన్నై :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తమ కూటమి లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగుతుందని డీఎంకే చీఫ్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 40 లోక్‌సభ నియోజకవర్గాల్లో స్టాలిన్ తమ అభ్యర్థిగా భావించి పార్టీ శ్రేణులు లోక్‌సభ ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాషాయ పార్టీని మట్టికరిపించేందుకు విపక్ష ఇండియా కూటమి లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు.బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండేందుకు వివిధ రాష్ట్రాల్లో పలు పార్టీలతో సంప్రదింపులు జరుగుతున్నాయని, సీట్ల సర్దుబాటు వివిధ రాష్ట్రాల్లో తుది దశకు చేరుకుందని స్టాలిన్ వివరించారు. ఇక తమిళనాడులో పాలక డీఎంకే విపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలో సీట్ల సర్దుబాటును ఖరారు చేసింది. కాంగ్రెస్ 9 స్థానాల్లో పోటీ చేనుండగా, పాలక డీఎంకే 21 స్థానాల్లో బరిలో నిలవనుంది. ఎండీఎంకే, ఐయూఎంఎల్, కేఎండీకే ఒక్కో స్థానంలో పోటీ చేయనుండగా, వీసీకే, సీపీఎం, సీపీఐకి రెండేసి లోక్‌సభ స్థానాలను కేటాయించారు. పుదుచ్చేరిలోని ఒక లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ బరిలో నిలుస్తుంది. ఇక 2019 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమి 38 స్థానాలను గెలుచుకుని ఘన విజయం సాధించింది. కాంగ్రెస్ తాను పోటీ చేసిన 9 స్థానాల్లో ఏకంగా 8 స్థానాల్లో విజయం సాధించింది.

# 6.5 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



**టీ మీడియా, మార్చి 10, గోదావరిఖని :** గోదావరిఖని పట్టణంలో పట్టణ ప్రగతి, డిఎంఎఫ్ టి 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు సిడిపి నిధులతో రూ.6.5 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు ఆదివారం రామగుండం నియోజకవర్గం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ శంకుస్థాపన చేశారు. ప్రజా అభివృద్ధి ఏ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీల పథకాలను అమలు చేస్తున్నామని, పేదలకు ఆరోగ్య భీమా కింద రూ.10 లక్షలతో పాటు రూ.500 కే గ్యాస్ సిలిండర్, రెండు యూనిట్ల లోపు ఉన్నవారికి ఉచిత కరెంటు, ఆర్టీసీలో ప్రయాణించే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుందని పేర్కొన్నారు. అలాగే ఇక నుంచి ఎలాంటి ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటి పథకం కూడా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు ఈ కార్యక్రమంలో మేయర్ తో పాటు కమిషనర్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆహార భద్రత దిశగా పయనం




**టీ మీడియా, మార్చి 10, గోదావరిఖని:** భారత ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఆర్ఎఫ్ సిఎల్ సామాన్య ప్రజలకు ఆహార భద్రత కల్పించే దిశగా ముందుకు వెళుతుందని చీఫ్ జనరల్ మేనేజర్ సుధీర్ కుమార్ ఝా అన్నారు. మేక్ ఇన్ ఇండియా చొరవతో ఆర్ ఎఫ్ సి ఎల్ శనివారం రైల్వే ల ద్వారా 350 రేకుల యూరియాను పంపిందని, ఈ సందర్భంగా కార్మికులు, అధికారులు, సీజీఎం 350 యూరియా రవాణా గూడ్స్ రైలు జెండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్ఎఫ్సిఎల్ తెలంగాణ మరియు ఇతర రాష్ట్రాల ప్రాంతాలకు 10.34 లక్షల మెట్రిక్ టన్నుల వేపపూతతో కూడిన యూరియాను పంపిందని ఇందులో తెలంగాణకు 418805.64 మెట్రిక్ టన్నులు,ఆంధ్రప్రదేశ్ కు 144198.90 మెట్రిక్ టన్నులు, కర్ణాటక 166322.70 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 69860.43 మెట్రిక్ టన్నులు, చత్తీస్ గఢ్ కు 78051.15 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 93770.73 మెట్రిక్ టన్నులు, మధ్యప్రదేశ్ కు 63217.98 మెట్రిక్ టన్నులు పంపినట్టు వారు వెల్లడించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**టీ మీడియా, మార్చి 10, రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని జిల్లా పరిషత్ పాఠశాల1992 - 1993 పదవ తరగతి బ్యాచ్ ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వారి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ స్కూల్లో జరిగిన సన్నివేశాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. అందరం ఒకే వేదికలో కలవడం ఆనందంగా ఉందని ఇలా అందరూ కలవడానికి కష్ట పడిన స్థానిక స్నేహితులను అందరూ అభినందించారు.ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్స్ ఆడెపు కృష్ణకుమార్,ఉప్పరి చంద్రమౌళి,గాదె శ్రీనివాస్, కుదిరె రామస్వామి, చంద్రగిరి వెంకటస్వామి, జక్కబోయిన కుమారస్వామి, కంది మహేంధర్,కత్తి రాజబాబు వినయవతి, సువార్త,రామిడి ఉమ, అనూరాధ లు పాల్గొన్నారు.

## ఎస్ డి పి ఐ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం




**టీ మీడియా, మార్చి 10, మహానంది:** మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో ఎస్ డిపిఐ పార్టీ(సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) నూతన మహానంది మండల పార్టీ కార్యాలయాన్ని శ్రీశైలం నియోజకవర్గం ఇన్చార్జి ఎన్ కె.యూనుస్ ముఖ్యఅతిథిగా హాజరైన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్డిపిఐ స్టేట్ ట్రెజరర్ సయ్యద్ ఫజలుల్లాహ్, నంద్యాల జిల్లా ప్రెసిడెంట్ మహేబూబ్ బాష, హాయాతుల్ ఇస్లాం మదరస నిర్వాహకులు మౌలానా అబ్దుల్ మన్నన్, ఎస్ డి పి ఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి

**- ఎండి. రహమతుల్లా కాంగ్రెస్ మండల నాయకులు**

**టీ మీడియా, మార్చి 10, వనపర్తి బ్యూరో :** మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి పిలుపు మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు కాంగ్రెస్ మండల నాయకులు ఎండి రహమతుల్లా మండల్ నాయకులు పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ చల్లా వంశీచందర్ రెడ్డి ని మక్తల్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తలు గెలుపు దిశలో విజయకేతనం ఎగరవేయాలని వాకిటి శ్రీహరి ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్, వెంకట్ నర్సింగ్, ఎస్టిడి శ్రీనివాసులు, ఆర్మీ శివ, అశోక్, ముక్తేష్ , సాయి రాఘవ, గౌస్‌పాల్గొన్నారు.



## సాదుల్ నగర్ మల్లన్న స్వామి జాతర ఉత్సవాలలో నీలం మధు ముదిరాజ్

**టీ మీడియా, మార్చి 10, హత్నూర :** హత్నూర మండలంలోని సాదుల్ నగర్ గ్రామంలో మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలకు నీలం మధు పార్టీ నాయకులు, సన్నిహితులతో కలసి వెళ్ళారు. గ్రామానికి చెందిన పెద్దలు, ఆలయ నిర్వాహకులు, యువకులు మధు కు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సంధర్భంగా మల్లన్న స్వామికి భక్తి శ్రద్ధలతో బజనలు చేస్తూ నీలం మదన్న జయహో అంటూ యువకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సంధర్భంగా మధు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు మధును సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో హత్నూర్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ, నర్సాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుర్రాల మల్లేష్,గ్రామ అధ్యక్షులు బిక్షపతి, తలరి ప్రసాద్, యాదగిరి, సంతోష్ గౌడ్,మల్లేశం,నరేందర్,ప్రసాద్,మహేష్, రాజు, గ్రామ పెద్దలు, ప్రజలు,కార్యకర్తలు, ఎన్.ఎం.ఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## కరాటే టోర్నమెంట్స్ లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేత

**టీ మీడియా, మార్చి 10, రామకృష్ణాపూర్ :** రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో కరాటే విద్యార్థిని, విద్యార్థులకు గత నెలలో జరిగినటువంటి కరాటే టోర్నమెంట్స్ జాతీయ, అంతర్జాతీయ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు ఆదివారం స్థానిక పట్టణ ఎస్సై రాజశేఖర్, తవక్కల్ స్కూల్ అధినేత అబ్దుల్ అజీజ్ ల చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది. ఎస్సై మాట్లాడుతూ ఇలాంటి కరాటే శిక్షణను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలకు ఇది ఎంతో అవసరమని, ప్రతి ఆడబిడ్డ కరాటే నేర్చుకొని వారి ఆత్మ రక్షణకు వారే కాన్ఫిడెంట్గా నిలబడాలని చెప్పారు. ఈ కరాటే వలన పిల్లలకు సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లెవెల్స్ పెరుగుతాయని, ఆరోగ్య పరిస్థితి బాగుంటుంది అని అన్నారు. మొబైల్,టీవీ చానల్స్ కు దూరంగా ఉండాలని కోరారు.కరాటే మాస్టర్ జుల శ్రీనివాస్ ను అభినందించారు. కరాటే కార్యక్రమాలు ఇంకా చాలామంది విద్యార్థిని, విద్యార్థులకు ఇలాంటి శిక్షణను అందించాలని,మా నుండి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు. అతిథులుగా వచ్చినటువంటి ఎస్సై రాజశేఖర్, అబ్దుల్ అజీజ్ లను మాస్టర్ జుల శ్రీనివాస్ శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు

# గ్రీన్ ఫీల్డ్ రహదారి మాకొద్దు

- రోడ్డెక్కిన అన్నదాతలు

**టి మీడియా, మార్చి 10, పెద్దపల్లి బ్యూరో :**
నేషనల్ హైవే 63 నిర్మాణంలో మార్పులను వ్యతిరేకిస్తూ మంచిర్యాల జిల్లా బాధితులు పెద్ద ఎత్తున రోడ్డెక్కుతున్నారు. పాత రహదారి నిర్మాణానికి పాతరేసి గ్రీన్ ఫీల్డ్ హైవే అంటూ కొత్త రూట్ మ్యాప్‌తో మా బ్రతుకులను రోడ్డు పాలు చేస్తున్నారంటూ ఆగ్రహిస్తూ రెండు మండలాల రైతులు ఆందోళన బాట పట్టారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వద్దు.. పాత రహదారే ముద్దు అంటూ వరుస నిరసనలు , ధర్నాలు , ఆందోళనలు చేపడుతున్నారు.గ్రీన్ ఫీల్ట్ రహదారంటూ పచ్చని పంటపొలాలను మింగేస్తున్న ఎన్ హెచ్ 63 రహదారి మాకు వద్దే వద్దంటూ ముక్తకంఠంతో నినదిస్తున్నారు 30 గ్రామాల ప్రజలు. పంట భూములు కోల్పోతున్నాం న్యాయం చేయాలంటూ వేడుకుంటూ రహదారి పై ధర్నాకు దిగారు ఎన్ హెచ్ 63 బాధిత రైతులు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం సూరారం వద్ద పెద్ద ఎత్తున రోడ్డు పై బైటాయించి ఆందోళన చేపట్టారు. మా భూములను కాపాడండి, లేదంటూ మా ప్రాణాలు తీసి మా పంట భూములను తీసుకోడంటూ ఆవేదన వ్యక్తం చేశారు.మంచిర్యాల %--% జగిత్యాల జిల్లాల మధ్య నిర్మాణం కానున్న జగ్దల్ పూర్ టూ నిజామాబాద్ జాతీయ రహదారి 63 కథ మళ్లీ మొదటికొచ్చింది. గ్రీన్ ఫీల్డ్ హైవే కారణంగా వందల ఎకరాల పచ్చని పంటలు కోల్పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ మంచిర్యాల జిల్లాల రైతులు రోడ్డెక్కారు. బడా వ్యాపారుల కోసం రూట్ మార్చి రైతుల భూములను మింగేసేలా జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.ప్యాకేజీ 4 లో భాగంగా ఆర్మూరు-మంచిర్యాల మధ్య జగిత్యాల జిల్లా రాయపట్నం



గోదావరి వంతెన నుండి మొదలై మంచిర్యాల జిల్లా ముల్కల వరకు 34 కి.మీ. మేర నిర్మాణం కానుంది. యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ హైవే కారణంగా 105 హెక్టార్ల పంట భూములను కోల్పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రైతులు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం సూరారం వద్ద రాస్తారోకో చేపట్టారు. వారం రోజులుగా వివిద రూపాల్లో అదికారులకు , ప్రజా ప్రతినిధులకు గోడు వెళ్లబోసుకుంటున్నా పట్టించుకున్న పాపన పోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ మహా ధర్నా చేపట్టారు.నిజామాబాద్ %--% జగిత్యాల %--% మంచిర్యాల జిల్లాల మధ్య మూడేళ్ల క్రితం ప్రపోజ్ చేసిన గ్రీన్ ఫీల్డ్ హైవేకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నేషనల్ హైవే 63 లో భాగంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల జిల్లా గద్దెరాగడి వరకు దీనిని నిర్మించేందుకు ఓకే చెప్పింది. 125 కిలోమీటర్ల పొడవైన ఈ ఫోర్ లేన్ కోసం మొదట రూ.2,591 కోట్లు కేటాయించగా, అంచనా వ్యయం మూడేళ్లలో అమాంతం పెరిగి రూ.3,850 కోట్లు ఖర్చు కు చేరింది. నాలుగు ప్యాకేజీలుగా నిర్మాణం కానున్న ఈ రహదారి ప్యాకేజీ1లో భాగంగా ఆర్మూరు నుంచి మెట్‌పల్లి వరకు 35.9 కి.మీ.. ప్యాకేజీ2 లో మెట్‌పల్లి నుంచి జగిత్యాల వరకు 28.7 కి.మీ.. ప్యాకేజీ3 జగిత్యాల నుంచి రాయపట్నం వరకు 31.9 కి.మీల రహదారి సర్వే పూర్తయి నిర్మాణం కూడా కొనసాగుతోంది.అసలు చిక్కల్లా ప్యాకేజీ4 లోని జగిత్యాలజిల్లా రాయపట్నం నుంచి మంచిర్యాల జిల్లా ముల్కల వరకు నిర్మాణం కానున్న 35.9 కి.మీ లోని వచ్చిపడింది. ఈ 35 కిమీల లో ఏకంగా 213 మంది రైతులకు చెందిన 105 హెక్టార్ల భూమిని ఎన్ హెచ్ 63 లో కనుమరుగుకానుంది. అయితే గతంలో ఇదే 35కిమీల లో 22 కిమీల రహదారిని బ్రౌన్ ఫీల్డ్ గా మారుస్తూ సర్వే నిర్వహించింది కేంద్రం. అయితే ఈ బ్రౌన్ ఫీల్డ్ రహదారితో లక్షెట్టిపేట మున్సిపాలిటీ ప్రమాదంలో పడనుంది. వ్యాపారులు రోడ్డెక్కడంతో సర్వే నిలిచిపోయింది. గల్లీ నుండి ఢిల్లీ వరకు బ్రౌన్ ఫీల్డ్ హైవే బాధితులు తమ వాయిస్ వినిపించడంతో రాత్రికి రాత్రే బ్రౌన్ ఫీల్డ్ రద్దైంది.తాజాగా యాక్సెస్ గ్రీన్ ఫీల్డ్ హైవే అంటూ కేంద్ర కొత్త పేరుతో ఎన్ హెచ్ 63 ప్యాకేజీ 4 సర్వే కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో పచ్చని పంట పొలాలు జాతీయ రహదారి పాపాన కోల్పోతున్నామంటూ రోడ్డెక్కారు 30 గ్రామాలకు చెందిన 210 మంది రైతులు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంతో పదేళ్ల క్రితం పచ్చనిపంట పొలాలనుకోల్పోయామని.. హైవే పేరుతో మరొసారి బాధితులుగా మారుతున్నామని.. ప్రభుత్వం పట్టించుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు ఎన్ హెచ్ 63 గ్రీన్ ఫీల్డ్ హైవే బాధితులు.

## మన్యం బంద్ విజయవంతం..

**టీ మీడియా, మార్చి 10, చింతూరు :** ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ ప్రకటించి ఆదివాసులకు వంద శాతం ఉద్యోగాలు కల్పించే జీవో నెంబర్ మూడుకు చట్టబద్ధత కల్పించే వరకు పోరాటం ఆగదు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసులకు ఆదివాసి



నిరుద్యోగులకు తీవ్ర నష్టం పరిచే ప్రభుత్వ విధానాలపై ఆదివాసులు ఐక్య పోరాటాలకు సిద్ధమై జీవో నెంబర్ ను అడుగు చట్టబద్ధత కల్పించే అంతవరకు ఏజెన్సీ ఆదివాసీ నిరుద్యోగుల 100% ఉద్యోగాలు కల్పించేటంత వరకు పోరాటానికి సిద్ధం కావాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, పులి సంతోష్, సిపిఎం జిల్లా నాయకులు సిసం సురేష్, పల్లపు వెంకట్ మడివి రాజు బంద్ లో పాల్గొన్న ప్రజానీకాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. డిమాండ్ చేశారు. ఆదివారం మార్చి 10 మన్యం బంద్ ఏజెన్సీ ఆదివాసి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని మన్యం రాష్ట్ర బంద్ పిలుపులో భాగంగా చింతూరు మండల వ్యాప్తంగా చింతూరు సెంటర్ వద్ద ఉన్న వ్యాపార దుకాణాలు ప్రయాణ వాహనాలు, పెట్రోల్ బంకులు, హోటల్స్ బంద్ నిర్వహించడం జరిగినది. బంద్ సందర్భంగా చింతూరు సెంటర్ వద్ద గిరిజన సంఘం నాయకులు, ఆదివాసి ఉద్యోగులు ఆదివాసి జనసేన తెలుగుదేశం ఆదివాసి నాయకులు ఏజెన్సీ మన్యం బందుకు మద్దతుగా చింతూరు నందు గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రదర్శన, నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్, సిపిఎం జిల్లా నాయకులు, సిసం సురేష్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని 100% ఉద్యోగాలు కల్పించే జీవో నెంబర్ మూడుకు చట్ట బద్ధత కల్పించాలని 1/70, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసి సంపూర్ణ అభివృద్ధి సాధించడానికి రాజ్యాంగబద్ధంగా ఉన్న హక్కులపై ప్రభుత్వాలు సుప్రీంకోర్టు ద్వారా దాడి చేస్తున్నాయని అధికారంలోకి రావడం కోసం వైసిపి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి ఏడాది డీఎస్సీ ప్రకటించి ఇస్తానని, ఈనాడు దగాడిఎస్సీతో ఆదివాస ప్రాంతాలలో ఉద్యోగాలు కల్పించాల్సినటువంటి ప్రభుత్వం ఆదివాసీలను దగా చేసి కేవలం 38 పోస్టులతో డీఎస్సీ ప్రకటించడం అన్యాయం అని 100% ఉద్యోగాలు కల్పించే జీవో నెంబర్ 3 చట్టబద్ధత కల్పించడమే ఆదివాసీలకు సామాజిక న్యాయం జరిపించడం అని అన్నారు. చట్టాలు పటిష్టంగా అమలు కోసం ఆదివాసీలందరూ కదిలి రావాలని ఐక్య ఉద్యమాల ద్వారానే ప్రభుత్వాలు దిగిరాక తప్పదని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో తుమ్మల ఎంపిటిసి రేఖ రాజ్ కుమార్, గిరిజన సంఘం నాయకులు దిలీప్, ముట్టం రాజయ్య, లెనిన్, శీలం తమ్మయ్య, పాండు నాగార్జున, కారం సుబ్బారావు, సాయి, కూర భీమయ్య, తీగల రవి, తదితరులు పాల్గొనడం జరిగినది.



## త్వరలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, మార్చి 10, వనపర్తి బ్యూరో :**
వనపర్తి పట్టణంలో ఏబీ చర్చి సంఘం పెద్దల ఆహ్వానం మేరకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి హాజరై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నికల హామీ మేరకు 4 గ్యారంటీలను అమలు చేయడం జరుగుతుంది. మిగిలినవి త్వరలోనే అమలు చేయడం జరుగుతుంది. త్వరలోనే వనపర్తిలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు, ఓబీసి జిల్లా అధ్యక్షులు కోట్ల రవి, బి. కృష్ణ, ఖమ్మరు మియా, పరుశురాం, రాగి వేణు, భాస్కర్ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దివాకర్, ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు రోహిత్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాగి, అక్షయ్, నరసింహా, చరణ్, పట్టణ మండల నాయకులు పాల్గొన్నారు.

## పదేండ్లు పాలించిండ్రు...యూనివర్సిటీ కాంపౌండ్ కూడా నిర్మించలే

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**టీ మీడియా, మార్చి 10,హన్మకొండ :**
రాష్ట్రాన్ని పదేండ్లు పాలిటించిన బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కాకతీయ యూనివర్సిటీ కాంపౌండ్ వాల్ కూడా నిర్మించలేకపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దుయ్యాబట్టారు. ఆదివారం ఆయన హన్మకొండలో పర్యటించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ కాంపౌండ్ వాల్‌కు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్యా, వైద్యరంగానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత వర్సిటీలో అడుగుపెట్టిన




మంత్రులం తామే అని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.మార్చి 11వ తేదీ సోమవారం రోజున ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం ప్రారంభం కాబోతోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన 75రోజుల్లోనే 31వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారు. టీఎస్‌పీఎస్సీని పునరుద్ధరించి ఉద్యోగ నోటీఫికేషన్లు ఇస్తున్నామని చెప్పారు.

## కందూరు విందులో పాల్గొన్న రావుల

**టీ మీడియా, మార్చి 10, వనపర్తి బ్యూరో :**
బిఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గుంపుగట్టయ్య దర్గా దగ్గర కందూరు నిర్వహించారు.వారి ఆహ్వానం మేరకు మాజీ ఎం.పి రావుల.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావుల



చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ గుంపు గట్టయ్య మహిమాన్విత దేవుడని ఈ స్వామివారిని దర్శించుకొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలివస్తారు. వారికి కనీస సౌకర్యాలు మంచినీరు,కామన్ హాల్ కోసం గతములో సహకరించడం జరిగిందని రాబోవు రోజులలో ఈ ప్రదేశాన్ని అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ విందులో పాల్గొన్న రావుల చంద్రశేఖరరెడ్డి కి ఆటో యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రావులతో పాటు మునిసిపల్ ఛైర్మెన్ గట్టు యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస.రమేష్ గౌడ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, ఎం.డి.గౌస్, నందిమల్ల రమేష్,ఆటో యూనియన్ నాయకులు యాదయ్య, గుజ్జం.శ్రీను, ఖలీల్,రావుఫ్,అనిల్, రాములు, మన్నెం,గోపి, అషాక్తాడితరులు పాల్గొన్నారు.

## ఎంపీ టిక్కెట్ రాకుండా భట్టి విక్రమార్క అడ్డుపడుతున్నారు

- కంటతడి పెట్టిన వీహెచ్


**టి మీడియా, మార్చి 10, హైదరాబాద్:**
లోక్ సభ ఎన్నికల వేళ తెలంగాణ కాంగ్రెస్‌లో సీట్ల కాక మొదలైంది.. ఎలాగైనా సీటు దక్కించుకునేందుకు ఇప్పటికే కొందరు అధిష్టానం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ తరుణంలో కాంగ్రెస్ సీనియర్ నేత వీ. హనుమంతరావు మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎంపీ అభ్యర్థుల ఎంపికపై ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అవకాశం ఎందుకు ఇవ్వరంటూ ప్రశ్నించారు. పార్టీలో పరిస్థితిని వివరిస్తూనే.. ఖమ్మం ఎంపీగా తనకు ఈసారైనా ఛాన్స్ ఇస్తే గెలుస్తానన్నారు.



ఖమ్మం ఎంపీగా పోటీ చేయకుండా తన పేరు లిస్ట్‌లో లేకుండా చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను టార్గెట్ చేశారు వీహెచ్ హనుమంతరావు.. ఈసారి ఎంపీ టికెట్ ఇస్తే గెలుస్తానంటూ వీహెచ్ వివరించారు. తన మీద ఎందుకీ కక్ష అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడు లోకల్ అంటున్నారు.. ఇదివరకు గెలిచిన వారంతా లోకలా ..? అంటూ ప్రశ్నించారు.భట్టి విక్రమార్క ఈస్థాయికి రావడంలో తన పాత్ర ఉందని పేర్కొన్న వీహెచ్ హనుమంతరావు.. ఇప్పుడు తనకు ఖమ్మం ఎంపీ టికెట్ ఇవ్వకుండా భట్టి ఎందుకు అడ్డుపడుతున్నారంటూ ప్రశ్నించారు. 2019లో భట్టి విక్రమార్క కనీసం తన పేరును కూడా అధిష్ఠానానికి పంపలేదన్నారు వీహెచ్.ప్రజలకు సేవ చేయాలన్నదే తన తపన అని.. తన వయసు మించిపోలేదని తనలాగా చురుగ్గా పార్టీలో పనిచేసే నేత ఎవరూ లేరని వీహెచ్ కంట కన్నీరు పెడుతూ గద్గద స్వరంతో మాట్లాడారు.

## ఇద్దరు చిన్నారులు మృతి, పరారీలో పేరెంట్స్

**టీ మీడియా, మార్చి 10,గార్ల :**
మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం అంకన్న గూడెంలో నేడు తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అనుమానస్పద స్థితిలో ఒకే కుటుంబంలోని ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటనలో మృతి చెందిన వారు లోహిత (3), జశ్విత(1) గా గుర్తించారు. కాగా చిన్నారులకు పాలలో విషం కలిపి హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రస్తుతం పిల్లల తల్లిదండ్రులు అనిల్, దేవి పరారీలో ఉన్నారని వారి కోసం గాలింపు చర్యలు



చేపట్టామని పోలీసులు తెలిపారు.వివరాల్లోకి వెళితే.. బయ్యారం మండలం నామాలపాడులో అనిల్, దేవి తమ పిల్లలతో కలిసి ఉంటున్నారు. వారం క్రితం అనిల్ తమ స్వగ్రామం అంకన్నగూడెంకు కుటుంబంతో కలిసి వచ్చాడు. అతడి తండ్రి వెంకన్న స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున షాపునకు వెళ్లిన వెంకన్న.. తిరిగి 10 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంట్లో చిన్నారులు విగతజీవులుగా పడి ఉన్నారు. కుమారుడు, కోడలు కనిపించలేదు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## జీవో నంబర్ 3 తెచ్చిందే కేసీఆర్ సర్కారు

- మంత్రి సీతక్క

**టీ మీడియా, మార్చి 10, హనుమకొండ:**
మహిళలను కోటీశ్వరులను చేయాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం అని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం హనుమకొండలోని కేయూలో రూ.68 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తోందని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు మహిళలను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహిస్తోందని చెప్పారు.'ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత



అనవసరంగా విమర్శలు చేస్తున్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే తాను సీఎం కావాలని ఆమె భావించారు. పార్టీ ఓటమితో ఆశలన్నీ గల్లంతయ్యాయి. మహిళలను కాంగ్రెస్ నుంచి దూరం చేయాలని కవిత యత్నిస్తున్నారు. జీవో నంబర్ 3కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. అసలు ఆ జీవో ఇచ్చిందే కేసీఆర్ సర్కారు అన్నారు. బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం బంద్ చేసి.. నిర్మాణాత్మక విపక్షంగా పనిచేయాలి' అని సీతక్క తెలిపారు.

## ఒకే పార్లమెంట్ స్థానం నుంచి బరిలోకి అన్నదమ్ములు

- ఎలాంటి వ్యూహ ప్రతి వ్యూహాలు అనుసరిస్తారోనన్న చర్చ
- అన్నదమ్ముల మధ్య సఖ్యతకు చాన్స్

**టీ మీడియా, మార్చి 10, చిత్తూరు :**
నల్లారి సోదరులు ఉమ్మడి చిత్తూరు జిల్లా పాలిటిక్స్?లో దాదాపు 5 దశాబ్దాలకు పైగా ఉన్న కుటుంబం. పివి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసిన నల్లారి అమర్నాథ్ రెడ్డి వారసులుగా రాజకీయాల్లో కొనసాగుతున్న అన్నదమ్ములు కిరణ్, కిషోర్ లు ఇప్పుడు 2024 సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. మాజీ సీఎం నల్లారి కిరణ్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్?లు ఇద్దరూ తొలిసారి ఒకే పార్లమెంట్ స్థానంలో వేరువేరు పార్టీల



నుంచి ఒకరు ఎంపీగా మరొకరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తారన్న ప్రచారం నడుస్తుంది. ఇప్పటికే పీలేరు అసెంబ్లీకి టిడిపి అభ్యర్థిగా మాజీ సీఎం కిరణ్ తమ్ముడు నల్లారి కిషోర్ పోటీకి సిద్ధమయ్యారు. 2104, 2019 సార్వత్రిక ఎన్నికల్లో పీలేరు అసెంబ్లీ నుంచి పోటీ చేసి ఓటమిపాలైన నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మూడోసారి అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. టిడిపి అభ్యర్థిగా పీలేరు నుంచి బరిలో ఉండనున్నారు. ఈ మేరకు టిడిపి అధిష్టానం కూడా నల్లారి కిషోర్ పోటీపై క్లారిటీ కూడా ఇచ్చింది. పీలేరు టిడిపి అభ్యర్థిగా ప్రకటించింది. ఇక రాష్ట్ర విభజన తర్వాత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్న మాజీ సీఎం కిరణ్ 2024 సార్వత్రిక ఎన్నికలపై దృష్టి పెట్టారు. పదేళ్ల గ్యాప్ తర్వాత తిరిగి పోటీకి సిద్ధమవుతున్నట్లు ఇప్పటికే అనుచరగణంతో అభిప్రాయాన్ని పంచుకున్న మాజీ సీఎం కిరణ్ ఎక్కడి నుంచి పోటీలో ఉంటారన్న దానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.ప్రస్తుతం బిజెపిలో కొనసాగుతున్న మాజీ సీఎం కిరణ్ పొత్తులో భాగంగా ఎంపీగా పోటీ చేస్తారన్న చర్చ కేడర్?లో నడుస్తోంది. ఇందులో భాగంగానే రాజంపేట పార్లమెంట్ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా బరిలో ఉంటారని తెలుస్తోంది. టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా మాజీ సీఎం కిరణ్ రాజంపేట పార్లమెంటు నుంచి బరిలో దిగితే అదే పార్లమెంట్ పరిధిలోని పీలేరు అసెంబ్లీ నుంచి తమ్ముడు నల్లారి కిషోర్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. దీంతో అన్నదమ్ములు ఇద్దరూ రాజంపేట ఎంపీగా ఒకరు, పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా మరొకరు ఎన్నికల బరిలో ఉండడం ఉమ్మడి చిత్తూరు పాలిటిక్స్?లో ఆసక్తికర పరిణామంగా మారబోతోంది. అయితే పొత్తుల లెక్క తేలినా పోటీ చేసే స్థానాలపై క్లారిటీ లేకపోవడంతో రాజంపేట పార్లమెంటు నుంచి బిజెపి పోటీ చేస్తుందా లేదా అన్న దానిపై సస్పెన్స్ వీడటం లేదు. దీంతో అన్నకు బీజేపీ నుంచి ఛాన్స్ దక్కే అవకాశంపై ఊహగానాలే వినిపిస్తున్నాయి. అయితే రాజంపేట పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా మాజీ సిఎం కిరణ్ పోటీ చేస్తారని పెద్ద ఎత్తున స్థానిక కేడర్?లో ప్రచారం కూడా కొనసాగుతోంది.2014, 2019 ఎన్నికలకు దూరంగా ఉన్న మాజీ సీఎం కిరణ్ 2024 ఎన్నికల బరిలో ఉంటానని ఇప్పటికే కిరణ్ కేడర్?కు క్లారిటీ ఇవ్వడమే ఈ ప్రచారానికి కారణం అవుతుంది. అయితే కిరణ్ పోటీ పై బిజేపీ అధిష్ఠానం నుంచి ఇప్పటిదాకా నో క్లారిటీ అన్నట్లు పరిస్థితి నెలకొంది. రాజంపేట పార్లమెంట్ పరిధిలో మైనారిటీ ఓటర్లు రెండున్నర లక్షలకు పైగా ఉండడంతో బిజెపి పోటీపై ఆచితూచీ వ్యవహరిస్తోంది. అయితే కిరణ్?కు రాజంపేట పార్లమెంట్ పరిధిలో పట్టు ఉండడంతో ఆయన్ని బరిలో దింపాలన్న ఆలోచన బిజెపి హై కమాండ్?లో బలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాజంపేట పార్లమెంట్ స్థానం నుంచి కిరణ్ పోటీ చేస్తారన్న ప్రచారం ఆయన అనుచరుల్లో కేడర్?లో జోష్?ను నింపుతోంది. ఇదే జరిగితే నల్లారి సోదరుల మధ్య గత ఐదేళ్లకు పైగా ఉన్న మనస్పర్ధలు ఎన్నికల్లో ఎలా పనిచేస్తాయో కేడర్?కి అంతుచిక్కని పరిస్థితిగా మారింది. ఇద్దరి మధ్య మాటలు లేకపోయినా బిజెపి అభ్యర్థిగా అన్న టిడిపి అభ్యర్థిగా తమ్ముడు ఎన్నికల ప్రచారంలో ఎలాంటి వ్యూహ ప్రతి వ్యూహాలు అనుసరిస్తారోనన్న చర్చ క్యాడర్ లో ఆసక్తిని కల్పిస్తోంది.రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఉన్న పీలేరులో అన్న కమలం గుర్తుతో తమ్ముడు సైకిల్ గుర్తుతో కలిసి ప్రచారం నిర్వహిస్తే ఆసక్తికర పరిణామంగానే ఉంటుందని స్థానికుల్లో చర్చ నడుస్తుంది. మాజీ సీఎంగా కిరణ్ సైలెంట్?గా ఉన్న సమయంలో కేడర్?ను కాపాడుకునేందుకు సైకిల్ ఎక్కిన తమ్ముడు నల్లారి కిషోర్ తీరును తప్పు పట్టడంతో నల్లారి సోదరుల మధ్య గ్యాప్ పెరిగిపోయింది. దాదాపు 5 ఏళ్లకు పైగా కిరణ్ కిషోర్ మధ్య మాట్లాడుకోవడాలు లేకపోగా సొంతూరు నగిరిపల్లికి వచ్చినా మాజీ సీఎం కిరణ్ కలికిరిలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ కి పరిమితం కావాల్సి వస్తుంది. సొంతింటి గడప తొక్కేందుకు ఇబ్బంది పడ్డ కిరణ్ ఎన్నికల పొత్తు వ్యవహారంతో అన్నదమ్ముల మధ్య సఖ్యతకు చాన్స్ దక్కే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. మిత్రపక్షం అభ్యర్థులుగా ఇద్దరు పోటీ చేస్తే అన్నదమ్ముల కలయిక చూడాలని అనుచర గణం కూడా ఉబలాటపడుతుంది.

## ప్రతిపక్షాలకు కనీసం ప్రశ్నించే హక్కు లేదు



**ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**

**టీ మీడియా, మార్చి 10, విజయవాడ:**
అధికార పార్టీ వైసిపి 'సిద్ధం' సభలతో ప్రభుత్వ ఆదాయాన్ని దోచుకుంటోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఒక్కో సిద్ధం సభకు రూ.90 కోట్లు ఖర్చు చేస్తోందని, మొత్తం ఈ సభల కోసం రూ.600 కోట్లు ఖర్చు పెట్టిందని ఆరోపించారు. ఇదంతా ఎవరి డబ్బు అని ప్రశ్నించారు. ఆదివారం విజయవాడలోని ఆంధ్రరత్నా భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. "గత ఎన్నికల ప్రచారంలో జగన్ ఇచ్చిన మాట మరిచారు. 2.30లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైంది? ఏపీపీఎస్సీ ద్వారా ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారు? మెగా డీఎస్సీ అంటూ దగా డీఎస్సీ వేశారు. కావాల్సిన వాళ్లకే వాలంటీర్ల పేరిట ఉద్యోగాలు ఇచ్చారు. ఉద్యోగాలపై మేం నిలదీస్తే తీవ్రవాదుల్లా చూశారు. గృహనిర్బంధాలు, అరెస్టులు చేశారు. ప్రతిపక్షాలకు కనీసం ప్రశ్నించే హక్కు లేకుండా చేశారు. కేంద్రంలో బిజెపి 10 ఏళ్లు అధికారంలో ఉంది. ఇచ్చిన హామీ ప్రకారం 20 కోట్ల ఉద్యోగాలు రావాలి. కానీ, ఇవ్వలేదు"అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై షర్మిల మండిపడ్డారు. తాను ఎన్నికల్లో ఎక్కడ నుంచి పోటీ చేయాలనే దానిపై చర్చ జరిగిందని, అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా

**టీ మీడియా, మార్చి 10, మహానంది:**
మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని పలు అభివృద్ధి పనులను శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ముందుగా వైసిపి నాయకులు కొండా మధుసూదన్ రెడ్డి, నాయకులు పూలమాలతో ఘనంగా సన్మానించి, స్వాగతం పలికారు.



గాజులపల్లెలోని జల జీవన్ మిషన్ నిధులు కోటి 49. లక్షల 97వేల రూపాయల నిర్మించిన వాటర్ ట్యాంక్, నాడు నేడు కార్యక్రమంలో భాగంగా 45.25 లక్షల రూపాయలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,బసాపురం గ్రామంలో 75 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన రైతు సహకార కేంద్రాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. అనంతరం గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించి అక్కడి వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

అలాగే ఇటివలే శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న మాజీ శ్రీశైలం దేవస్థానం ధర్మకర్త, వైసిపి నాయకులు రవి స్వామి నివాసానికి ఎమ్మెల్యే శిల్పా వెళ్లి పరామర్శించి, ఆయన ఆరోగ్యం, యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గాజులపల్లె షాదీ ఖానా వద్ద నూతన నీటి బోరు వద్ద పూజలు నిర్వహించి, నిర్మాణ దశలో ఉన్న షాదీ ఖానా ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి,డాక్టర్ వెంకట్ రెడ్డి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, సర్పంచ్ చంటి,వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**టీ మీడియా, మార్చి 10, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆరో వార్డు కు చెందిన మృతురాలు నందిముళ్ల సవారమ్మ నందిమల్ల బుచ్చన్న వయస్సు 85 సంవత్సరాలు అనారోగ్య కారణములతో శనివారం రాత్రి మృతి చెందింది. వారి మృతి మాకందరికీ తీరని లోటు అని చంద్రమౌళి వనపర్తి( వై) జిల్లా కాంగ్రెస్ మీడియా సెల్ కన్వీనర్, వనపర్తి జిల్లా తెలుగు ముదిరాజ్ సంఘం (వై)అధ్యక్షులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి ఆ భగవంతుడు మనోధైర్యం కలిగించాలని అదేవిధంగా దహన సంస్కారాల ఖర్చులకై 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. వారికి భవిష్యత్తులో కూడా వారి కుటుంబానికి అండగా ఉంటానని మనోధైర్యం కల్పించడం జరిగింది.

## మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి

**టీ మీడియా, మార్చి 10, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని 6వ వార్డుకు చెందిన నందిమల్ల.సవరమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని కౌన్సిలర్ కంచె.రవి నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పార్థీవ దేహాన్నికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. నిరంజన్ రెడ్డి వెంట మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్, గౌనికాడి యాదయ్య, ఓడి రాములు తదితరులు ఉన్నారు.



## వివిధ విభాగాల్లో మైహెూం ఇండస్ట్రీకి అవార్డులు

**టి మీడియా, మార్చి 10, మేళ్ళ చెరువు :**




ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన మైన్స్ ఎన్విరాన్‌మెంట్, మినరల్ కన్జర్వేషన్ వీక్ 2023-24 రాష్ట్ర స్థాయి ముగింపు కార్యక్రమంలో స్థానిక మై హెూమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేళ్లచెరువు మైన్స్ , చౌటుపల్లి లైమ్ స్టోన్ మైన్స్ వివిధ విభాగాల్లో అవార్డ్స్ సాధించినది. ఓవర్ ఆల్ పర్యావరణ పరిరక్షణ విభాగం లో మేళ్ల చెరువు మైన్స్ (మై హెూమ్ లైమ్‌స్టోన్) ద్వితీయ,అలాగే క్రమబద్ధమైన శాస్త్రీయ అభివృద్ధి విభాగం లో మేళ్ల చెరువు మైన్స్ మొదటి బహుమతి,ఖనిజ సంరక్షణ మరియు పబ్లిసిటీ, ప్రచారం విభాగం లో చౌటుపల్లి మైన్స్ మొదటి బహుమతి, అడవుల పెంపకం , సంరక్షణ విభాగం లో వేపల మాధవరం మైన్స్ మూడవ బహుమతి ని సాధించినది.ఇట్టి బహుమతులను ముఖ్య అతిథి పిఎన్ శర్మ కంట్రోలర్ జనరల్, ఇంచార్జ్ నాగ్‌పూర్ చేతుల మీదుగా సంస్థ ప్రెసిడెంట్ యూనిట్ హెడ్ యన్. శ్రీనివాసరావు ఈ అవార్డులనుఅందుకున్నారు.

ఈ సందర్భంగా సంస్థ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. యాజమాన్యం మరియు కార్మికుల సమిష్టి కృషి వలన ఈ అవార్డులు సాధించినామని, అలాగే ఈ అవార్డ్స్ తమకు ఎంతో స్ఫూర్తి ని ఇచ్చాయని, అయన తెలిపారు.ఈ సందర్భంగా సంస్థ కార్మికులకు అధికారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మైన్స్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ అప్పలరాజు, మైనింగ్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## అరకొరగా రోడ్డు విస్తరణ పనులు

- నిత్యం ట్రాఫిక్ జామ్ తో ప్రజలు ఇబ్బందులు

**టీ మీడియా, మార్చి 10, వనపర్తి బ్యూరో :**



ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో ప్రతినిత్యం తప్పని ట్రాఫిక్ జామ్ సమస్యలు గాంధీ చౌక్ మెయిన్ చౌరస్తాలో వందల కొద్ది వాహనాలు తిరుగుతుండడంతో ప్రతిరోజు ట్రాఫిక్ జామ్ ఎక్కువగా పెరుగుతుంది. గత ప్రభుత్వం రోడ్డు పనులు అరకొరగా చేయించడంతో ఎటు గాని పరిస్థితిలో రోడ్డు విస్తరణ సగం వరకు నిలిచిపోయింది. గంటల కొద్ది ట్రాఫిక్ జామ్ అవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇది గత ప్రభుత్వం నిర్లక్ష్యము లేక కాంట్రాక్టర్ల నిర్లక్ష్యము తెలియదు గానీ ఎక్కడికక్కడ గంటల కొద్ది ట్రాఫిక్ జామ్ తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి రోడ్డు పనులు వేగవంతంగా చేయాలని కోరారు.

## జ్యోతి నగర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు

- ముఖ్యఅతిథిగా హాజరైన కాట సుధా శ్రీనివాస్ గౌడ్

**టీ మీడియా, మార్చి 10, రామచంద్రాపురం :**



రామచంద్రాపురం 112 డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్ కమ్యూనిటీ హాల్ లో జ్యోతి నగర్ డ్వాక్రా గ్రూప్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్టింగ్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపి, అక్కడ నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన వారికి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాట సుధా శ్రీనివాస్ గౌడ్ బహుమతులు అందజేశారు.

## కొమ్ముల గట్టు వెంకటేశ్వర స్వామి దర్శించుకున్న డా. జిల్లెల చిన్నారెడ్డి మాజీ మంత్రివర్యులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు

**టీ మీడియా, మార్చి 10, వనపర్తి బ్యూరో :**



వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలం జంగమయ్య పల్లి గ్రామంలో కొమ్ముల గట్టు వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఐ సత్య రెడ్డి, మాజీ వైసిపి ఉమామహేశ్వరి, సుభాష్ గౌడ్, బాలరాజ్, జిల్లా వికలాంగుల కమిటీ అధ్యక్షుడు గంజాయి రమేష్, కదిరే రాములు, ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దేవన్న, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దివాకర్ యాదవ్, వంశీ, రోహిత్, చంద్రశేఖర్, దిలీప్ కుమార్ యాదవ్, నరసింహ, యాదయ్య, రాఘవేందర్ రెడ్డి, నవీన్ చరణ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజులు సెలవు కావడంతో రెచ్చిపోయిన అక్రమ దారులు

- క్రింది స్థాయి అదికారులు చెప్పినా వినని వైనం
- పై అధికారులు ఏం చేస్తారో వేచి చూడాలి

**టీ మీడియా, మార్చి 10, అమీన్పూర్ :**



అమీన్పూర్ మున్సిపాలిలో అక్రమ నిర్మాణాలు జోరు అందుకున్నాయి. మహాశివరాత్రి రెండో శనివారం ఆదివారం మూడో రోజు సెలవు దినం కావడంతో రెచ్చిపోతున్న అక్రమార్కులు అమీన్పూర్ సర్వేనెంబర్ 576 పట్టా భూమి లో సుమారు 0.30 గుంటలో పుట్టగొడుగుల్లాగా అక్రమణాలు జరుగుతున్నాయి. కోర్టు పరిధిలో కేసు ఉన్న భూమి లో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన ఎటువంటి ఫలితం లేదు అని యజమాని వాపోయాడు. అధికారులు చెప్పిన కూడా వినకుండా అక్రమ నిర్మాణం దౌర్జన్యం చేస్తున్నారని యజమాని వాపోయారు. అధికారులు అక్రమ తొలగిస్తారా లేదా అక్రమ నిర్మాణాలకు సపోర్ట్ చేస్తార వేచి చూడాలి.

## ప్రజాదీవెన సభను జయప్రదం చేయండి

- కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు అశేషంగా తరలిరావాలి
- మంత్రి పొంగులేటి పిలుపు

**టి మీడియా, మార్చి 10, ఖమ్మం:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల మైదానంలో ఈనెల 11న మధ్యాహ్నం 3గంటలకు జరిగే ప్రజా దీవెన సభను విజయవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలుత భద్రాచలం రాములోరిని దర్శించుకుంటారని, అనంతరం మణుగూరులో జరిగే సభలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు గాను ఇప్పటికే నాలుగు గ్యారంటీలను నెరవేర్చామని, తాజాగా ఐదో గ్యారంటీకి శ్రీకారం చుడతారని పేర్కొన్నారు. కావున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రజాదీవెన సభను విజయవంతం చేయాలని కోరారు.

# బస్సు డిపో ముందు ఆర్టీసీ డ్రైవర్ ధర్నా

- ఇబ్బంది పెడుతున్న బ్రీతింగ్ మిషన్
- తప్పుడు మిషన్తో తప్పుడు రిపోర్టులు

**టి మీడియా, మార్చి 10, మధిర:**









ప్రతిరోజు ఉద్యోగుల బ్రీతింగ్ చెకింగ్ చేయగా మధిర ఆర్టీసీ లో 2009 నుంచి డ్రైవర్ గ చేస్తున్న సంద్ర నాగేశ్వరరావు చాలా మంచి వ్యక్తి అని ఎటువంటి అలవాటు లేవని తోటి కార్మికులు చెబుతున్నారు. ఆర్టీసీ కొత్త పరికరంతో ఆదివారం బ్రీతింగ్ చెకింగ్ చేయగా 16 పాయింట్లు వచ్చిందని అతనిని డ్యూటీకి పంపించడం కుదరదని చెప్పగా ఆయన నాకు ఎటువంటి అలవాటు లేదని మీరు మధిర గవర్నమెంట్ హాస్పిటల్ బ్రిటిష్ రిపోర్టు కైనా సిద్ధమేని చెబుతున్న ఆర్టీసీ కార్మికుడు ఉద్యోగి సంద్ర నాగేశ్వరరావు.కార్మికుడు మనోవేదనతో చాలా మంచి వ్యక్తినగా నాకున్న డ్రైవింగ్లో ఇన్ని సంవత్సరాలు ఆల్ కాల్స్ తీసుకున్న అలవాటు లేదని కేవలం ఒక్కపొడి లవంగాలు తప్ప ఇంకేమీ తీసుకున్న దాఖలు లేవని తప్పుడు సమాచారంతో నన్ను రిమూవ్ చేస్తే మనస్థాపానికి గురై ఇంటికి తిరిగి వెళ్లి మొఖం చూపించలేనని నేను ఆత్మహత్య చేసుకున్న దానికి ఆర్టీసీ యాజమాన్యమే బాధ్యత వహించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అందుబాటులో లేని డిపో మేనేజర్, ఎస్పై దామోదర్ కేవలం టెలిఫోన్ ద్వారా స్పందించి మేము ఏమీ చేయలేమని, పై అధికారులకి సమస్య తీసుకెళ్లవచ్చని సమాచారం.రెండు రోజుల క్రితం మరొక ఆర్టీసీ డ్రైవర్ అమర్లపూడి వెంకట్ కు 825679 స్టాఫ్ నెంబర్కు బ్రీతింగ్ అనలైజర్ టెస్ట్ ఆర్టీసీ డిపోలో చేయగా ఆ డ్రైవర్ 369 పాయింట్లు రాగా మరల దగ్గరలోని ఎరుపాలెం వెళ్లి చెకింగ్ చేసుకోగా 0 వచ్చిందని ఆ విషయం మధిర బస్ డిపో సెక్యూరిటీ అధికారులకు వచ్చి చెప్పిన మాకు సంబంధం లేదని అతని డ్యూటీలకి రానికుండా చేయడం వలన ఆ కుటుంబాలు రోడ్డు మీద పడడం ఆర్టీసీలో తరచూ జరుగుతుంది. ఈ సమస్యను ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యలు తలెత్తకుండా చేయాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అటిసి కార్మికులకు ప్రతి సంవత్సరం ఇవ్వవలసిన యూనిఫాంలు కూడా ఇవ్వడం లేదని వారి సొంత డబ్బులతో యూనిఫాంలో కుట్టించుకునే దుస్థితి ఆర్టిసి ఉద్యోగులపై మోపిందని ఆర్టీసీ ఉద్యోగులను యాజమాన్యం తరచూ ఏదో ఒక సమస్యతో నిత్యం వేధిస్తుందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రైతులు బాగుంటేనే దేశం బాగుంటుంది

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

**టీ మీడియా, మార్చి 10, మహానంది:**



రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. ఆదివారం మహానంది క్షేత్రంలోని రెండవ రోజు జాతీయ ఒంగోలు జాతి వృషభ రాజుల బండ లాగు పోటీలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఎద్దుల యజమానులను శాలువాతో సత్కరించి, మెమోంటో బహుకరించి, చలకాల చేతపట్టి పందెం దూలం ఎక్కి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతుల సంబరాలను చూడటానికి రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన వేలాది రైతంగానికి, ప్రజలకు అభినందనలు తెలిపారు.పందెం పోటీలకు బహుమతులు అందిస్తున్న దాతలకి, పోటీలను దగ్గరుండి నిర్వహిస్తున్న ఆర్గనైజర్స్ కు తన తరుపున ప్రత్యేకించి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే సంవత్సరం కూడా తాను భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలవబోతున్నానని, వచ్చే సంవత్సరం పోటీలలో విజేత ఎద్దులకు బహుమతులు పెంచుతానని అన్నారు. సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతి లక్ష 50 వేలు, రెండవ బహుమతి లక్ష రూపాయలు, మూడు 75 వేలు, నాలుగు 50 వేలు, ఐదు 40 వేల రూపాయలు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇదే కాకుండా కన్సలోషన్ బహుమతి ప్రతి ఎద్దుల జతకి 20 వేలు రూపాయలు అందిస్తామన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి లక్ష, రెండవ బహుమతి 75 వేలు, మూడో బహుమతి 60 వేలు, నాలుగో బహుమతి 50 వేలు, ఐదో బహుమతి 40 వేల రూపాయలు ఉంటుందన్నారు. ఇదే కాకుండా కన్సలోషన్ బహుమతి ప్రతి ఎద్దుల జతకి 10 వేలు రూపాయలు అందిస్తామని తెలిపారు.న్యూ కేటగిరిలో మొదటి బహుమతి 75 వేలు, రెండవ బహుమతి 60 వేలు , మూడు 50 వేలు, నాలుగు 40 వేలు,ఐదవ బహుమతి 30 వేల రూపాయలు ఉంటుందని,ఇదే కాకుండా కన్సలోషన్ బహుమతి ప్రతి ఎద్దుల జతకి 5 వేలు రూపాయలు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నాలుగు సంవత్సరాలు పంట సాగుకు నీరు, పంట గిట్టుబాటు ధర పుష్కలంగా అందించడం జరిగిందని, ఈ సంవత్సరం వర్షాల లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని, రైతుల కోసం, రైతులకి మద్దతుగా ప్రతిపక్ష పాత్ర కూడా నేనే పోసించి, సాగు నీరు కోసం అధికారులతో గొడవ పడి నీరు అందించానని, శిల్పా అంటే రైతుల బాంధువుడు, రైతు కుటంబం నుండి వచ్చిన వ్యక్తిని కాబట్టే రైతులు కష్టాల తెలుసు కాబట్టే రైతులకు ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటానని తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక మహానంది క్షేత్రం నిధులు కేవలం 60 లక్షల రూపాయల ఉంటే, నేటికి 18 కోట్ల రూపాయలకు చేరిందని, అలాగే దేవాలయానికి వచ్చే భక్తులు, యాత్రికులు ఇబ్బంది పడకూడదని దగ్గర్లోనే పార్కింగ్ కూడా ఏర్పాటు చేశామని,మహానంది క్షేత్రాన్ని సుందరంగా, అద్భుతంగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో అటు ప్రభుత్వం నిధులతోనే కాకుండా, నా సొంత డబ్బుని సైతం ఆలయ అభివృద్ధి కోసం ఖర్చు పెడుతున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు,రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## భార్య ఆస్ట్రేలియాలో..భర్త హైదరాబాద్‌లో

- రోడ్డు పక్కన చెత్త డబ్బాలో లభ్యమైన శవం
- తెలుగు మహిళల వరుస మరణాలు

**టి మీడియా, మార్చి 10, హైదరాబాద్:**



ఆస్ట్రేలియాలో తెలుగు మహిళల వరుస మరణాలు కలవరపెడుతున్నాయి. మొన్నటికి మొన్న కృష్ణా జిల్లాకు చెందిన వైద్యురాలు ఉజ్వల ట్రెకింగ్‌కు వెళ్లి లోయలో పడి మృతిచెందింది. ఆ విషాద ఘటన మరువకముందే మరో ఘోరం జరిగింది. ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంలోని బక్లీ ప్రాంతంలో హైదరాబాద్‌కు చెందిన వివాహిత హత్యకు గురైంది. రోడ్ పక్కన ఉన్న ఓ దాబా హెూటల్‌లో మహిళను చంపేసినట్లు గుర్తించారు పోలీసులు. మృతురాలు హైదరాబాద్ ఎ ఎస్ రావు నగర్ వాసి శ్వేతగా నిర్ధారించారు. శ్వేత మృతికి భర్తే కారణమని అనుమానిస్తున్నారు బంధువులు. శ్వేత భర్త కొడుకుతో కలిసి హైదరాబాద్‌లో ఉండడం.. శ్వేత ఆస్ట్రేలియాలో హత్యకు గురికావడం అనుమానాలకు తావిస్తోంది. హత్య వెనుక భర్త హస్తంపై బంధువుల అనుమానం వ్యక్తంచేస్తున్నారు.అయితే, శ్వేత మృతదేహం శనివారం ఒక డబ్బాలో లభించినట్లు ఆస్ట్రేలియా పోలీసులు తెలిపారు. దుండగులకు శ్వేతతో పరిచయం ఉందని విక్టోరియా పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. హత్య చేసిన తర్వాత అక్కడి నుంచి వేరే దేశానికి పారిపోయారు. శ్వేత భర్త తమ మూడేళ్ల కుమారుడితో సహా హైదరాబాద్ వెళ్లిపోయారని మెల్‌బోర్న్‌లోని ఓ వార్తా ఛానెల్ ప్రసారం చేసింది. హత్యకు గల కారణాలను పోలీసులు ఇంకా నిర్ధారించలేదు.. ఈ ఘటనపై ఆస్ట్రేలియా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అయితే, ఆస్ట్రేలియాలో మహిళల హత్యపై అక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. శ్వేత హత్యతో కలిపి ఈ ఏడాది హత్యకు గురైన వారి సంఖ్య 18కి చేరినట్లు అక్కడి మీడియా వెల్లడించింది.

### ఆమెను భర్తే చంపేసి చెత్త డబ్బాలో వేసి

చైతన్యను ఆమె భర్తే చంపి చెత్త డబ్బాలో వేసినట్లు తేలింది. హత్య చేసిన భర్త అశోక్ రాజ్‌ను ఆస్ట్రేలియా పోలీసులు అరెస్ట్ చేశారు.చైతన్య హత్య తర్వాత తన కొడుకుతో హైదరాబాద్ ఏఎస్ రావు నగర్‌లోని తన ఇంటికి వచ్చాడు అశోక్ రాజ్. అనంతరం ఆస్ట్రేలియాకు వెళ్లి విక్టోరియా పోలీస్ స్టేషన్‌లో అశోక్ లొంగిపోయాడు.వారం రోజుల క్రితం ఆస్ట్రేలియా విక్టోరియా బక్లీలో రోడ్డు సమీపంలో ఉన్న ఓ చెత్త డబ్బాలో చైతన్య మృతదేహాన్ని అతడు దాచిపెట్టాడు. కాగా, చైతన్య చెల్లెలు రాచకొండ కుషాయిగూడ పోలీసులకు కూడా సమాచారం అందించింది. హత్యకు గురైన చైతన్య ఏఎస్‌రావు నగర్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బాల్ శెట్టి గౌడ్ కుమార్తెగా పోలీసులు గుర్తించారు.చైతన్యను భర్త ఎందుకు చంపాడన్న విషయాలు తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు తదుపరి విచారణ జరుపుతున్నారు. కుటుంబ కలహాల వల్లే చైతన్య భర్త దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

## నూతన దంపతులను ఆశీర్వదించిన డిఐజీ రంగనాధ్ దంపతులు



**టీ మీడియా, మార్చి 1లో, ఖమ్మం :**ఇటీవల వివాహ వేడుకతో ఒక్కటైన నూతన వధూవరులను వరంగల్ రేంజ్ డీఐజీ ఏవీ రంగనాధ్ దంపతులు ఆశీర్వదించారు. ప్రముఖ విద్యావేత్త, బీఆర్ఎస్ సీనియర్ జిల్లా నాయకులు గుండాల కృష్ణ కుమార్తె ధాత్రి వివాహం జరిగిన విషయం తెలిసిందే. కాగా వివాహ వేడుకకు హాజరు కాలేకపోయిన డీఐజీ రంగనాధ్ సతీసమేతంగా ఆదివారం ఖమ్మం వచ్చి కృష్ణ ఇంటికి వెళ్లారు. వివాహ వేడుక విశేషాల గురించి అడిగి తెలుసుకున్న వారు వధూవరులకు తమ ఆశీస్సులు అందించారు.

## శ్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న - డా. జిల్లెల చిన్నారెడ్డి, డా.జిల్లెల ఆదిత్య రెడ్డి

**టీ మీడియా, మార్చి 10, వనపర్తి బ్యూరో :**



వనపర్తి మండలం చిమనగుంట గ్రామంలోని సీతారామ ఆలయంలో పూజ చేసి తదనంతరం ఆదివారం అమావాస్య సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, వారి కుమారుడు డాక్టర్ జిల్లెల ఆదిత్యా రెడ్డి అక్కడ జరిగే అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొనడం జరిగింది.

## బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం కొరకు సన్నద్ధత

**టీ మీడియా, మార్చి 10, రామకృష్ణాపూర్ :**



క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు,ఇంచార్జ్ కంబోగోని సుదర్శన్ గౌడ్,గాండ్ల సమ్మయ్య ల ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా డాక్టర్ రాజా రమేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ పరిచయ కార్యక్రమానికి 13 మార్చి 2024 బుధవారం ఉదయం 10 గంటలకు ఆర్కేపి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సమావేశము జరగనున్నది. కావున ఈ సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ హాజరుకానున్నారు. అంతేకాకుండా ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సమాచారము గూర్చి వివరంగా వివరించేందుకు ఈ సమావేశము నిర్వహించబడుతుంది.కావున బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అందరూ తప్పకుండా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయగలరని కోరారు.ఈ సమావేశంలో జాడి శ్రీనివాస్, రేవెల్లి ఓదెలు,జిలకర మహేష్,భూమా గౌడ్, గోపు రాజం తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి లో చేరిన మాజీ కౌన్సిలర్

**టీ మీడియా, మార్చి 10, వనపర్తి బ్యూరో :**



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పట్టణ చేరికల కమిటీ కన్వీనర్ సబిరెడ్డి వెంకట్ రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరిన మాజీ కౌన్సిలర్ అలివేలమ్మ గతంలో వనపర్తి మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా 2 వ వార్డు, 11 వ వార్డు నుంచి రెండు పర్యాయాలు కౌన్సిలర్ గా గెలిచి ప్రజా జీవితంలో ఉన్న అలివేలమ్మ 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో 14వ వార్డు అభ్యర్థిగా పోటీలో ఉండి పరాజయం పొందిన తర్వాత క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్న శ్రీమతి అలివేలమ్మను వనపర్తి పట్టణ చేరికల కమిటీ కన్వీనర్ సబిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కలిసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ బిజెపి అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ విజయానికి స్తబ్దుగా ఉన్న సీనియర్ నాయకులందరూ క్రియాశీలక భూమిక పోషించాలని ఆహ్వానించడంతో అలివేలమ్మ వారి భర్త కేశవాచారి తో కలిసి ఆదివారం బిజెపి కండువా కప్పుకోవడం జరిగిందని, రాబోయే పార్లమెంటు ఎన్నికలు మరియు అదే విధంగా వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి గెలుపు లక్ష్యంగా పనిచేస్తానని అలివేలమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేరికల కమిటీ సభ్యులు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి,ఏ.సీతారాములు, జిల్లా కార్యదర్శి చిత్తారి ప్రభాకర్, జిల్లా అధికారుల ప్రతినిధి గొర్ల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఘోర ప్రమాదం.. ఆరుగురు మృతి

**టీ మీడియా, మార్చి 10, లక్నో :**



ఉత్తరప్రదేశ్‌లోని జాన్‌పూర్‌లో శనివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఆరుగురు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రతీ గ్రామానికి రహదారులు నిర్మాణం

### -డిప్యూటీ సి ఎం మల్లు భట్టీ విక్రమార్క



**టీ మీడియా, మార్చి 10,మధిర:** నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రహదారుల నిర్మాణం పూర్తి చేసి, అన్ని రంగాలలో అభివృద్ధి పర్చడం జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖా మాత్యులు మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం ఉప ముఖ్యమంత్రి చింతకాని, బోనకల్, ముదిగొండ మండలాల్లో పర్యటించి, రూ.4318.70 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్‌తో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు నుండి పాతర్లపాడు వరకు రూ. 700.00 లక్షలతో 5.30 కి.మీ మేర నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు, రాఘవాపురం నుండి అల్లీపురం వరకు రూ. 200 లక్షలతో 1.70 కి.మీ. రోడ్డు విస్తరణ పనులకు, రాఘవాపురం నుండి లచ్చగూడెం వరకు రూ. 280.00 లక్షలతో 3.00 కి.మీ. మేర నిర్మించనున్న బి.టి. రోడ్డుకు, రాఘవాపురం నుండి లచ్చగూడెం వరకు రూ. 320.00 లక్షలతో 2.50 కి.మీ. మేర నిర్మించనున్న బి.టి. రోడ్డు పనులకు శంకుస్థాపన, బోనకల్ మండలం లక్ష్మిపురం గ్రామంలో రూ. 20.00 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయితీ భవనమును ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఆళ్లపాడు నుండి గోవిందాపురం వరకు రూ. 289.80 లక్షలతో 3.20 కి.మీ. మేర నిర్మించనున్న నూతన బి.టి. రోడ్డుకు, లక్ష్మిపురం నుండి పాతర్లపాడు వరకు రూ. 277.25 లక్షలతో 3.00 కి.మి. మేర నిర్మించనున్న బి.టి రోడ్డుకు, కలకోట నుండి నారాయణపురం వరకు రూ. 85.00 లక్షలతో 5.00 కి.మి. మేర నిర్మించనున్న బి.టి. రోడ్డు పనులకు ఉప ముఖ్యమంత్రి శంఖుస్థాపనల చేశారు. రూ. 422.15 లక్షలతో గోవిందాపురం నుండి మోటమర్రి వరకు 4.60 కి.మి. మేర నిర్మించనున్న బి.టి. రోడ్డు పనులకు, రూ. 539.50 లక్షలతో ఆళ్లపాడు నుండి నారాయణపురం 5.00 కి.మి. మేర నిర్మించనున్న బి.టి. రోడ్డు పనులకు, అనంతరం ముదిగొండ మండలం వనంవారి క్రిష్ణాపురం గ్రామంకు చేరుకొని గోకెనపల్లి వెంకటాపురం చిరుమర్రి వనంవారి క్రిష్ణాపురం జగన్నాదపురం ఆర్.అండ్.బి. రోడ్డు విస్తరణ పనులకు ఆయన శంఖుస్థాపనలు చేశారు. రూ. 4318.70 లక్షల వ్యయంతో 44.10 కి.మీ. మేర నిర్మించనున్న బి.టి. రోడ్ నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధిర నియోజకవర్గం అన్ని మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసి రవాణా వ్యవస్థను మెరుగుపర్చడం జరగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లడం జరుగుతుందని, అర్హులైన పేద వారందరికి అభయహస్తం సంక్షేమ ఫలాలు అందుతాయని అన్నారు. అనంతరం చింతకాని మండలంలో పాత్రికేయుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏ. రేవంత్‌రెడ్డి భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని సహచర మంత్రివర్యులతో కలిసి లాంఛనంగా ప్రారంభోత్సవం చేయనున్నారని తెలిపారు. నియోజవర్గానికి 3500 ఇండ్ల చొప్పున ప్రతి నియోజకవర్గానికి ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మార్చి 12వ తేదీన మరో బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభయహస్తం, సంక్షేమ పథకాలపై పాత్రికేయుల సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్యాంప్రసాద్, పంచాయితీరాజ్ ఎస్.ఈ. చంద్రమౌళీశ్వరరావు, ఖమ్మం ఆర్.డి.ఓ. జి.గణేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.